రామానందలో కోర్సులకు ఉచిత శిక్షణ

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతకు స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజుల కాల పరిమితితో కూడిన స్పోకెన్ ఇంగ్లిష్ , సాఫ్ట్ స్కిల్స్ (ఇంటర్మీడియట్ పాస్), కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ (ఇంటర్మీడియట్ పాస్ / ఫెయిల్), మొబైల్ ఫోన్ రిపేరింగ్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ (ఎస్ఎస్సీ పాస్), ఏసీ రిఫ్రిజిరేటర్ రిపేర్, మెయింటెనెన్స్ (ఎస్ఎస్సీపాస్)కోర్సులు నిర్వహించబడునని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో మార్చి 6న ఉదయం 10 గంటలకు రామానంద సంస్థలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. సంస్థలో హాస్టల్ వసతి కలదని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9133908000, 9133908111, 9133908222, 9948466111లలో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 1 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

పోలింగ్‌లో యాదాద్రి టాప్

ఎన్నికలేవైనా అగ్రస్థానం

టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో 96.54 శాతంతో రికార్డు

గతంలో పట్టభద్రులు, అసెంబ్లీ, పార్లమెంట్ పోరులోనూ ముందంజ

చైతన్యాన్ని చాటుతున్న జిల్లా ఓటర్లు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలు ఏవైనా యాదాద్రి భువనగిరి జిల్లా ఓటర్లు చైతన్యం ప్రదర్శిస్తున్నారు. రికార్డు స్థాయిలో పోలింగ్‌లో పాల్గొంటూ శెభాష్ అనిపించుకుంటున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాక తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టాప్‌లో నిలిచారు.

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం ఎన్నికలు జరగ్గా.. మొత్తం 12 కొత్త జిల్లాల పరిధిలో 24,139 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 93.57 శాతం మంది ఓటు వేశారు. ఇందులో అత్యధికంగా యాదాద్రి భువనగిరి 96.54 శాతం పోలింగ్‌తో తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో సూర్యాపేట(94.97శాతం), నల్లగొండ(94.75శాతం), మహబూబాబాద్(94. 47శాతం) జిల్లాలు ఉన్నాయి.

వరుస ఎన్నికల్లోనూ హవా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు జరిగిన వరుస ఎన్నికల్లోనూ రాష్ట్రంలోనే యాదాద్రి భువనగిరి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ పోలింగ్ శాతంలో టాప్ ప్లేస్‌లో ఉంది. ఈ స్థానంలో మొత్తం 12 జిల్లాలు ఉండగా యాదాద్రి జిల్లా 78.59శాతం పోలింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైన పార్లమెంట్ స్థానంగా భువనగిరి రికార్డు నెలకొల్పింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కలిపి 76.78శాతం ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ జిల్లాలో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం జరిగింది. రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైన మొదటి జిల్లాగా రికార్డు నెలకొల్పింది. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలు కలిపి మొత్తం 90.36శాతం ఓట్లు పోలయ్యాయి.

యాదాద్రి భువనగిరిలో పోలింగ్ నమోదు ఇలా..

ఎన్నిక	పోలింగ్ శాతం
పట్టభద్రుల ఎమ్మెల్సీ	78.59
పార్లమెంట్ ఎన్నికలు	76.78
అసెంబ్లీ ఎన్నికలు	90.36
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ	93.57

జిల్లా ఓటర్ల చైతన్యం..

ఎన్నికలు ఎప్పుడు జరిగినా జిల్లా ఓటర్లు చైతన్యం ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా అర్బన్ ప్రాంతాల్లో పోలింగ్ శాతం అతి తక్కువగా నమోదు అవుతుంది. కానీ అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న జిల్లాలో మాత్రం ఇంత స్థాయిలో పోలింగ్ నమోదవడం విశేషం. జిల్లాలో ఎన్నికల సమయంలో ఎక్కడా లేనివిధంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. స్థానికంగా ఉన్న ఓటర్లే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం పెద్దసంఖ్యలో క్యూ కడుతున్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంతో అధికారులు కూడా సక్సెస్ అవుతున్నారు.

విజయంపై ఎవరి ధీమా వారిదే

టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్‌లో స్వల్ప పెరుగుదల

తుది పోలింగ్ 93.57 శాతం

- ఆర్జాలబావి గోదాములకు చేరిన బ్యాలెట్ బాక్సులు
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద నిరంతర నిఘా
- పోలింగ్ సరళిపై అభ్యర్థుల సమీక్షలు
- కీలకం కానున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు
- ఈ నెల 3న ఓట్ల లెక్కింపు

అత్యంత ఉత్కంఠ రేకెత్తిస్తున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇప్పుడు అందరి అంచనాలు గెలుపోటములపైకి మళ్లాయి. గురువారం నాటి పోలింగ్ సరళిని విశ్లేషిస్తూ ప్రధాన అభ్యర్థులంతా శుక్రవారం జిల్లాల వారీగా పరిస్థితిని సమీక్షించారు. ఆయా జిల్లా నాయకత్వాలను సంప్రదిస్తూ మండలాల వారీగా పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము చేసిన కృషి, చివరి వరకు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రదర్శించిన శక్తియుక్తులు, చివర్లో ఓట్ల కోసం ప్రయోగించిన తాయిలాలు వగైరా అన్నీ కలిపి ఎంత వరకు సఫలమయ్యామన్న దానిపై ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో తమ వ్యూహాలు, ప్రయోగాలు, పోలింగ్ రోజున ఓటర్ల నాడిని బట్టి గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఇవ్వాల, రేపటి వరకు ఈ గెలుపోటముల చర్చోపచర్చలు సహజం. 3న కౌంటింగ్ జరుగనున్నది. సోమవారం మధ్యాహ్నం వరకే ఫలితాల సరళి వెల్లడికానుంది. పోలింగ్ నాటి సరళిని పరిశీలిస్తే ప్రథమ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజేత తేలకపోవచ్చని, ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానున్నట్లు తెలుస్తున్నది. ఇదే సమయంలో ప్రధాన అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ఎలిమినేషన్ రౌండ్స్ వరకు వస్తే గానీ విజేత తేలకపోవచ్చన్న అంచనాలు లేకపోలేదు.

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)

నల్లగొండ ఆర్జాలబావిలోని స్ట్రాంగ్ రూమ్‌కు బరిలో నిలిచిన అభ్యర్థుల తరపున వచ్చిన ప్రతినిధుల సమక్షంలో తాళం వేయించిన కలెక్టర్, ఆర్ఓ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి టఫ్ ఫైట్ నెలకొన్నట్లుగా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. 2013, 2019 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్విముఖ పోరు కొనసాగగా ఈసారి అందుకు భిన్నంగా బహుముఖ పోటీ తెరపైకి వచ్చింది. ప్రధాన సంఘాల నుంచి ఎక్కువ మంది కీలక అభ్యర్థులు బరిలో ఉండడం, అందరూ చివరి వరకు శక్తివంచన లేకుండా గెలుపు కోసం ప్రయత్నించడంతో గెలుపోటములు అంచనాకు అందడం లేదన్న చర్చ వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో గురువారం నాటి పోలింగ్ సరళిపై కీలక సంఘాల నేతలు, అభ్యర్థులంతా శుక్రవారం రోజంతా సమీక్షలు చేస్తూనే ఉన్నారు. ప్రధాన సంఘాల అభ్యర్థులు వారి నాయకత్వంతో క్షేత్రస్థాయి వరకు పరిస్థితులను అంచనా వేశారు. ఇక బీసీ సంఘాలతోపాటు ఇతర యూనియన్ల మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులు వారికి సంబంధించిన వారితో లెక్కల్లో మునిగి తేలుతున్నారు. మండలాల వారీగా ఉన్న ఓట్లెన్ని, పోలైనవి ఎన్ని, పోలైన వాటిల్లో మనకు ఎన్ని వచ్చి ఉంటాయంటూ ఆరా తీస్తూ బిజీబిజీగా గడిపారు. ఈ క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగు బెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంటుందన్న అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వీరిద్దరూ తమ యూనియన్ల ద్వారా క్షేత్రస్థాయి వరకు వివరాలు సేకరించిన అనంతరం గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ల పరంగా ఈ రెండింటికీ ప్రతి మండలంలో కార్యవర్గాలు ఉండడం, నిరంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, పోలింగ్ రోజు వరకు అప్రమత్తంగా ఉండడం వంటి అంశాల నేపథ్యంలో వీరిరువురూ తమదే గెలుపంటే తమదేనన్న ధోరణి వ్యక్త పరుస్తున్నారు. ఇక బీసీ సంఘాల మద్దతుతో టీచర్స్ జాక్ అభ్యర్థిగా రంగంలో నిలిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం గెలుపుపై ధీమాతో ఉన్నారు. బలమైన బీసీవాదంతోపాటు గతంలో పీఆర్‌టీయూలో కీలక నేతగా, ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం, నియోజకవర్గవ్యాప్తంగా ఓటర్లకు సుపరిచితం వంటి అంశాలు తన విజయానికి దోహదం చేస్తాయన్న అంచనా కనబరుస్తున్నారు. పీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్‌టీయూ మాజీ నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి కూడా విజయం తనదేనని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి దగ్గరగా ఉండి ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలు పరిష్కరించే సత్తా తనకే ఉందని ఓటర్లు విశ్వసించి ఓటేసినట్లు ఆయన పేర్కొంటున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన జాతీయ వాదం, బీజేపీ మద్దతు, మాజీ ఉపాధ్యాయ నేతగా అనుభవం తదితర అంశాలతో గెలుపుపై ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 3న జరుగనున్న కౌంటింగ్‌పై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

నువ్వా.. నేనా అన్నట్లు

కీలకం కానున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు

పోలింగ్ సరళిని బట్టి తొలి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలదన్నది స్పష్టం. ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కీలకం కానున్నాయి. అభ్యర్థులు తమ ప్రచారంలో తొలి ప్రాధాన్యత ఓట్లపైనే ప్రధానంగా దృష్టి సారిస్తూనే అనుమానం ఉన్న చోట కనీసం రెండో ప్రాధాన్యత ఓటైనా వేయాలని అభ్యర్థించారు. కేవలం ఎన్నికల ప్రచార అంశాలు, అభ్యర్థుల గుణగణాల ఆధారంగా అయితే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పెద్దగా పోలయ్యేవో, కావో నన్న సందేహాలు ఉన్నాయి. కానీ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాన అభ్యర్థుల్లో యూటీఎఫ్ మినహా మిగతా వారంతా ఓటర్లను డబ్బు, మద్యం, విందులతో ప్రలోభ పెట్టే ప్రయత్నాలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఈ డబ్బు, మద్యం, విందు, వినోదాలే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో కీలకంగా మారనున్నాయన్న చర్చ తీవ్రంగా జరుగుతున్నది. ఒక అభ్యర్థి నుంచి ఏదైనా కానుక స్వీకరించినప్పుడు మానవ నైజం ప్రకారం వారికి ఏదో ఒక ఓటు వేసే తత్వం సహజం. ఇప్పుడు ఇదే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లల్లో కీలకంగా మారనుంది. ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థుల నుంచి తాయిలాలు అందిన ఓటర్లు 1, 2, 3... ఇలా ప్రాధాన్యత ఓట్లు వేశారన్న చర్చ ఉంది. ఇలాంటి ఓట్లు ఎవరికి లాభిస్తాయి? ఎవరికి నష్టం చేస్తాయన్న చర్చ జోరుగా సాగుతున్నది. ప్రలోభాల పర్వం కూడా ప్రస్తుతం గెలుపోటములపై స్పష్టమైన అంచనాకు అడ్డుగా నిలుస్తున్నదని తెలుస్తున్నది. ఇది ఎక్కువగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ ఫలితం తేలక ఎలిమినేషన్ రౌండ్స్‌కు కౌంటింగ్ దారి తీయవచ్చన్న అంచనాలూ లేకపోలేదు.

జిల్లాల వారీగా తుది పోలింగ్

జిల్లా	మొత్తంఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్‌శాతం
సిద్దిపేట	166	156	93.98
జనగాం	1,002	945	94.31
హన్మకొండ	5,215	4,780	91.66.
వరంగల్	2,352	2,213	94.09.
మహబూబాబాద్	1,663	1,571	94.47.
భూపాలపల్లి	329	310	94.22.
ములుగు	628	583	92.83.
భద్రాద్రికొత్తగూడెం	2,022	1,859	91.94
ఖమ్మం	4,089	3,805	93.05.
యాదాద్రి	984	950	96.54.
సూర్యాపేట	2,664	2,530	94.97.
నల్లగొండ	4,683	4,437	94.75.
మొత్తం	25,797	24,139	93.57

స్ట్రాంగ్ రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులు

గురువారం సాయంత్రం 12 జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను ముందుగా ఆయా జిల్లా కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తరలించారు. అక్కడికి అన్ని చేరాక భారీ బందోబస్తు నడుమ రూట్ల వారీగా శుక్రవారం తెల్లవారుజాము వరకు నల్లగొండలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములకు తరలించారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో జిల్లాల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ, ఎస్పీ శరత్ చంద్రపవార్ నేతృత్వంలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్‌కు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థతోపాటు 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్థానిక పోలీసులతోపాటు అదనపు ఫోర్స్‌తో నిరంతర నిఘా పెట్టారు. ఈ నెల 3న ఉదయం 8గంటలకు కౌంటింగ్ మొదలుకానుంది. అంతకుముందే స్ట్రాంగ్ రూమ్స్‌ను ఓపెన్ చేసి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలిస్తారని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లేనని, హాల్స్‌ను సిద్ధం చేశామని, ఏ చిన్న ఆటంకమూ కలుగకుండా కౌంటింగ్ పూర్తి చేయడమే లక్ష్యమని ప్రకటించారు.

తుది పోలింగ్‌లో స్వల్ప పెరుగుదల

గురువారం సాయంత్రం 4 గంటల తర్వాత వెల్లడించిన పోలింగ్‌కు అర్ధరాత్రి తర్వాత పోలింగ్ కేంద్రాల వారీగా సేకరించిన తుది వివరాల ప్రకారం వెల్లడైన పోలింగ్ శాతంలో స్వల్ప పెరుగుదల కనిపించింది. నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లారుజామున వెల్లడైన వివరాల ప్రకారం తుది పోలింగ్ 93.57శాతంగా నమోదైంది. గురువారం సాయంత్రం వివరాల ప్రకారం ఇది 93.55శాతంగా ఉన్న విషయం తెలిసిందే. నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లకు గానూ 24,139 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉండగా.. సిద్దిపేటలో 93.98శాతం, జనగామలో 94.31శాతం, హన్మకొండలో 91.66, వరంగల్‌లో 94.09, మహబూబాబాద్‌లో 94.47, భూపాలపల్లిలో 94.22, ములుగులో 92.83, భద్రాద్రికొత్తగూడెంలో 91.94, ఖమ్మంలో 93.05, యాదాద్రి భువనగిరిలో 96.54, సూర్యాపేటలో 94.97శాతం, నల్లగొండ జిల్లాలో 94.75 శాతం పోలింగ్ నమోదైంది. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 3.16 శాతం పోలింగ్ పెరుగడం విశేషం. గత ఎన్నికల్లో తుది పోలింగ్ శాతం 90.41శాతంగా ఉంది. ఈ పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి కలిసి వస్తుతుందనే ఉత్కంఠత కూడా నెలకొంది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- కలెక్టర్ హనుమంతరావు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 1 : ఈ నెల 5 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 29 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం 6,208 మంది, ద్వితీయ సంవత్సరం 6,350 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ అధికారులు తప్పిదాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులు నడుపాలని, పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో శానిటేషన్ చేపట్టాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నాపత్రాల కవర్ సీల్ తీయడం, జవాబు పత్రాలను కవరులో ఉంచి సీల్ వేయడం వంటివన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగాలన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఒత్తిడికి గురికాకుండా టెలీ మానస్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రోజారమణి, ఎగ్జామ్స్ కమిటీ అధికారి మంజుల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్నానానికి వెళ్లి అన్నదమ్ముళ్ల దుర్మరణం

- ఇద్దరూ ఏడేండ్లలోపు పిల్లలే
- నక్కలగండితండాలో విషాదం

చందంపేట, ఫిబ్రవరి 28 : తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఆడుకుంటూ స్నానానికి వెళ్లి నీటి కుంటలో పడి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. చందంపేట మండలంలోని నక్కలగండి కట్ట సమీపంలోని ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోత్యాతండా పరిధిలోని నక్కలగండి తండాకు చెందిన కాట్రావత్ రూప్లా, సరోజ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు హరిప్రసాద్(7), బిట్టు(5) ఉన్నారు. శుక్రవారం ఉదయం రూప్లా దంపతులు వ్యక్తిగత పని మీద దేవరకొండకు వెళ్లారు. పిల్లలిద్దరూ ఇంటి వద్దే ఉండి ఆడుకుంటున్నారు. నక్కలగండి కట్ట సమీపంలో ఇసుక తోడడంతో ఏర్పడిన గుంతల్లో డిండి ప్రాజెక్టు నుంచి వచ్చిన నీరు వచ్చి చేరడంతో కుంటలు మారి నీళ్లు నిలిచాయి. హరిప్రసాద్, బిట్టు స్నానం చేసేందుకు నీటి కుంటలో దిగారు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలు కనిపించలేదు.

చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుంట వద్ద పిల్లల బట్టలు ఉండడం గమనించి గాలించగా ఇద్దరి మృతదేహాలు దొరికాయి. పిల్లల మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను పోస్టుమార్టం కోసం పోలీసులు దేవరకొండ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

నీళ్లు లేక పశువుల పాలు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని తుక్కాపురం గ్రామంలో రైతు ఎరుకల నవీన్‌గౌడ్ మూడెకరాల్లో వరి పంట సాగు చేశాడు. నీళ్లు లేకపోవడంతో ఎకరంనరలో పంట ఎండిపోయింది. దాంతో పశువులను మేపుతున్నాడు.

వరి పైర్లు పశువులకు మేతాయె

నీళ్లు లేక ఎండిపోతున్న పంట

పొట్ట దశలో నీరు అందక అవస్థలు

ఇంకుతున్న భూగర్భ జలాలు.. వట్టిపోతున్న బోర్లు

గొర్రెలు, మేకలకు మేతగా మారుతున్న వరి పైర్లు

తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం

రైతన్నకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో రోజురోజుకు కరువు పరిస్థితులు తీవ్రమవుతున్నాయి. భూగర్భ జలాలు ఇంకి బోర్లు, బావులు మరోవైపు వట్టిపోవడంతో నీళ్లు లేక పొట్ట దశలో వరి పొలాలు ఎండి పోతున్నాయి. దిక్కుతోచని స్థితిలో రైతులు మేకలు, గొర్రెల మేతకు పంటలను వదిలిపెడుతున్న దుస్థితి నెలకొంది.

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో 2.8 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. అధిక శాతం మంది వరి వేశారు. ఆయకట్టేతర ప్రాంతాల్లో ఎక్కువ శాతం బోర్లు, బావుల కిందే వరి సాగు చేశారు. జిల్లాలో ఇప్పటికే అన్ని చోట్ల వరి పైర్లు పొట్ట దశకు వచ్చాయి. ఈ సమయంలో నీళ్లు సరిపడా అవసరం. కానీ చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు ఇంకిపోయాయి. బోర్లు కూడా వట్టిపోవడంతో నీటి తడికి కష్టమవుతున్నది. భువనగిరి, ఆత్మకూర్.ఎం, రాజాపేట, గుండాల, అడ్డగూడూరు, సంస్థాన్‌నారాయణ పురం, భువనగిరి తదితర మండలాల్లో వరి పైర్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికే రెండు వేల ఎకరాలకుపైగా పంట నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలాగే ఉంటే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందకపోవడంతో రైతులు తీవ్రంగా మనోవేదన చెందుతున్నారు. సుమారుగా ఒక్కో ఎకరానికి రూ.26వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో దున్నకం, నాట్లు, విత్తనాలు, ఎరువులు, మందులు, కూళ్లు, ఇతర పనులకు ఖర్చు చేశారు. ఎకరాకు 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని భావించారు. క్వింటాకు రూ. 2వేలు అనుకున్నా రూ.56 వేలు రావాల్సి ఉంది. ఎకరం భూమి సరిగ్గా పంట దిగుబడి వస్తే పెట్టుబడి పోనూ రూ. 33వేలు లాభం రైతుకు మిగాలి. ఇప్పుడు పంటలు ఎండిపోవడంతో ఎకరానికి రూ. 30 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు వాపోతున్నారు. ఇక ప్రభుత్వం రైతు భరోసా జమ చేయకపోవడంతో పెట్టుబడికి అప్పులు తెచ్చిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

రోజురోజుకూ పరిస్థితులు తీవ్రం

జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతున్నాయి. జనవరి నెలలో భూగర్భ జలాలు 10మీటర్ల లోతుకు వెళ్లాయి. గతేడాది జనవరి నెలలో ఉన్న భూగర్భ జలాలతో పోలిస్తే గణనీయంగా 2.71 మీటర్లు తగ్గాయి. సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఏకంగా 11.48 మీటర్ల మేర కిందికి పడిపోయాయి. ఆత్మకూర్ (ఎం)లో 17.10, తుర్కపల్లి, ఆలేరు, బొమ్మలరామారం, రామన్నపేట, మోటకొండూర్ మండలాల్లో 11 మీటర్ల దూరంలో ఉన్నాయి. నీటిమట్టం పడిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. కొన్ని చోట్ల బోర్లు ఆగి ఆగి పోస్తున్నా పంటలకు ఏమాత్రమూ చాలడం లేదు.

పదేండ్లలో ఇంత కరువు చూడలేదు

నేను మూడెకరాలు, మా తమ్ముడు మూడెకరాలు వరి పెట్టినం. ఇద్దరికి కలిపి ఒక్కటే బోరు ఉంది. ఒక్క బోరుతోనే ఆరు ఎకరాలు పంట పండించేవాళ్లం. ఆరెకరాల మీద అప్పు చేసి 2 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టినం. పంట పొట్టకు వచ్చింది. 15 రోజులు అయితే చేతికి వస్తుంది. ఈ టైమ్‌లో బోరు ఎండిపోయింది. పదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. చేసేది లేక ఎండిపోయిన పొలంలో గొర్లు, పశువులను మేపుతున్నాం. ప్రభుత్వం ఆదుకుని పరిహారం చెల్లించాలి.

-బచ్చనగోని రాములు, రైతు, ఆరెగూడెం గ్రామం (సంస్థాన్ నారాయణపురం మండలం)

సంస్థాన్ నారాయణపురం మండలంలోని ఆరెగూడెం గ్రామంలో పొలంలో మేత మేస్తున్న గొర్రెలు